క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడి



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

మనుబోలు : మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు పాట్లేళ్ల ఏడుకొండలు, అతని తండ్రి వెంకటేశ్వర్లు, సోదరి బొనిగి రమణమ్మపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు కొందరు ఆదివారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పాట్లేళ్ల ఏడుకొండలు తన ఇంట్లో మట్టి పోసుకునేందుకు రోడ్డుపై మట్టి తోలించాడు. ఈ విషయమై అవతలి వారితో శనివారం చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఉన్న తమను ఆనాల ఏడుకొండలు, మహేష్, వెంకటేశ్వర్లు, పరంధామయ్య, గొనిగి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లికార్జున, నలగర్ల మనోహర్ తదితరులు దాడి చేసి గాయపరిచారని పాట్లేళ్ల ఏడుకొండలు తెలిపాడు. బాధితులు నెల్లూరు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శేష వాహనంపై విహరించిన మహావిష్ణు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో మహావిష్ణు ఉభయదేవేరులతో శేషవాహనంపై ఆదివారం విహరించారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థాన స్థానాచార్యుడు కొమాండూరు ఇళయవిల్లి స్థలశాయి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఉభయకర్తలుగా తలమంచి వెంకటేశ్వరరావు, వెంకట సునీత, రత్నయ్య, సుజాత, పీటీ జగన్నాథం, పద్మజ, విష్ణుతేజ, శ్రీనివాస్, భార్గవి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, మురళీమోహన్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

ఏజెంట్ల ఎంపికలకు ఇంటర్వ్యూలు

నెల్లూరు(మినీబైపాస్): తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవి త బీమా పాలసీలను సేకరించేందుకు గా నూ ఏజెంట్ల ఎంపికకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని తపాలా శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణ పేర్కొ న్నారు. ఆచారివీధిలోని ప్రధాన తపాలా కార్యాలయంలో గల పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నామని చెప్పారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



నెల్లూరు (టౌన్): పొదలకూరు రోడ్డులోని సంజయ్‌గాంధీనగర్‌లో క్రికెట్ టోర్నీని ఆదివారం నిర్వహించారు. అరుణ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన టోర్నీకి ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత బెజవాడ మేఘనాథ్‌సింగ్ మాట్లాడారు. 31, 32, 33వ డివిజన్ల నుంచి 8 జట్లు టోర్నీలో పాల్గొన్నాయని చెప్పారు. అనంతరం విజేతగా నిలిచిన ఎస్వీఎస్ స్టార్స్ జట్టుకు రూ.ఐదు వేలను శమంతకమణి ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు ఎంపికైన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

ముగిసిన బాలవికాస్ వేసవి శిబిరం



నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సాయి హృదయ, సత్యసాయి మందిరంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పురవీధుల్లో సత్యసాయిని ఊరేగించారు. అనంతరం చిన్నారులకు బహుమతులను అందజేశారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయిహృదయ మందిర నిర్వాహకులు మురళీకృష్ణ, కొండా శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలవికాస్ గురువులు ప్రభావతమ్మ, భారతి, నాగలక్ష్మి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో గూడు



ఈమె పేరు శింగంశెట్టి సుప్రియ. వెంకటాచలానికి చెందిన ఈమె గత ప్రభుత్వంలో సొంతింటి కోసం పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి అర్జీలు అందజేసింది. ఇల్లు మంజూరు చేస్తామని చెబుతూ అధికారులు పట్టించుకోలేదు. జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు కొందరికే ఇళ్లు మంజూరు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలో ఇంటి పట్టా అందజేశారు. పక్కా ఇల్లు మంజూరు చేయడంతో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. తన సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆమె పేర్కొంది.



ఈయన పేరు చల్లా సునీల్. తిక్కవరప్పాడుకు చెందిన ఈయనకు సొంతిల్లు లేదు. అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. తనకున్న స్థలంలో సొంతిల్లు కట్టుకోవాలని అధికారులకు అర్జీ ఇచ్చిన వెంటనే పక్కాఇల్లు మంజూరు చేశారు. బిల్లులు సైతం వెంటనే చెల్లిస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నాడు. గతంలో ఇల్లు మంజూరు కావాలంటే సంవత్సరాలు తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తుండడం సంతోషకరమని పేర్కొన్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో పేదలు సొంత గూడు కోసం ఎన్నో అర్జీలు అధికారులకు ఇచ్చారు. కానీ జన్మభూమి కమిటీల పెత్తనంతో కొందరికే ఇళ్లు మంజూరు కావడంతో అర్హులు అద్దె గృహాల్లోనే ఉండాల్సి వచ్చింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల హామీల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు అందజేశారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌తో పాటు బిల్లులను సకాలంలో అందజేస్తూ పేదల సొంతింటి కలను సాకారం చేసి పేదల గుండెల్లో గూడు కట్టుకున్నారు.



సర్వేపల్లిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు

వెంకటాచలం: 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో విలువైన ప్రభుత్వ భూములను గుర్తించి 37 లేఅవుట్లు నిర్మించింది. జగనన్న కాలనీల పేరుతో లేఅవుట్లలో అన్నీ వసతులను కల్పించారు. అందులో సొంత ఇంటి స్థలం లేని వారికి ఇంటి పట్టాతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. మండలంలోని జగనన్న కాలనీల్లో 2633 మందికి, సొంత స్థలం కలిగిన 2329 మందికి కలిపి మొత్తం 4962 ఇళ్లు మంజూరు చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకు గ్రామానికి ఒకరిద్దరికీ మాత్రమే ఐదేళ్లలో ఇళ్లు మంజూరు చేశారు. వాటికి బిల్లులు మంజూరులో జాప్యం చేయడంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాణ్యమైన మెటీరియల్‌ను సరఫరా చేయడంతో పాటు బిల్లులు సత్వరమే చెల్లించి పేదల సొంతింటి కలను నెరవేర్చారు.

మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ

మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను పూర్తి చేయించేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు అదనపు వసతుల కోసం పొదుపు గ్రూపుల ద్వారా వడ్డీ లేని రుణం రూ.30వేలు ఇప్పించారు. అలాగే పేదలైన ఎస్టీల ఇళ్లను పూర్తి చేయించేందుకు ఒక్కో ఇంటికి రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మండలంలో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్మాణ మెటీరియల్‌ను ఇవ్వడంతో పాటు బిల్లులను వెంటనే చెల్లిస్తుండడంతో గృహాలను త్వరితగతిన నిర్మించుకుంటున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వెంకటాచలంలోని జగనన్న కాలనీలో సాగుతున్న గృహ నిర్మాణ పనులు

మొత్తం మంజూరైన ఇళ్లు	-4962
పూర్తయిన ఇళ్లు	-769
పునాది దశలో ఉన్నవి	-2717
గోడలు దశలో ఉన్నవి	-604
స్లాబు దశలో ఉన్నవి	-312
ఇంకా ప్రారంభమవని ఇళ్లు	-560

శరవేగంగా గృహ నిర్మాణాలు



మండలంలోని 37 జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయడంతో బిల్లులు వెంటనే చెల్లిస్తుండటంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇంటి పనులు చేసుకుంటున్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదు.

– సీహెచ్.వెంకటేశ్వర్లు, గృహనిర్మాణ శాఖ, ఏఈ

పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు : డాక్టర్ వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆల్తుర్తి పశువైద్యాధికారి పీ రాధిక ఆదివారం కోరారు. ఈ పథకం కింద మూడేళ్ల కాలానికి గానూ హైబ్రీడ్ పాడి పశువులకు రూ.960, నాటు పశువులకు రూ.192 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీలు, బీపీఎల్ కుటుంబాలు 25శాతం ప్రీమియం కడితే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. బీమా పరిహారం కింద హైబ్రీడ్ పాడి పశువులకు గరిష్టంగా రూ.30 వేలు, నాటు పశువులకు రూ.15వేల వరకు అందజేస్తారని వివరించారు. గతంలో ఎద్దు, దున్నపోతులకు బీమా సౌకర్యం లేదని, ఈ ఏడాది నుంచి వాటికి కల్పిస్తున్నట్లు తెలిపారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగే మహాకుంభాభిషేక వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని ఈదూరులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ హేమలత ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈదూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని విద్యార్థులకు కానుకలు అందజేస్తారని చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

సోమిరెడ్డి మళ్లీ నవ్వులపాలు

వెంకటాచలం: వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో ఉన్న టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలను చేర్చేకునే విషయంలో పదేపదే నవ్వులపాలవుతున్నాడు. తాజాగా వెంకటాచలం మండలం కాకుటూరుకు చెందిన పలు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరినట్లు సోమిరెడ్డి ప్రకటించిన 24 గంటల్లోపే.. తాము టీడీపీలో చేరలేదని, వైఎస్సార్‌సీపీని ఎట్టిపరిస్థితుల్లో వీడబోమని వారు చెప్పడంతో సోమిరెడ్డిని ప్రజలు జోకర్‌లా భావిస్తున్నారు. వెంకటాచలం మండలం కాకుటూరులో శనివారం జరిగిన సినీనటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలకు సోమిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీకే చెందిన కొందరికి, జన్మదిన వేడుకలకు వచ్చిన మరికొందరికి సోమిరెడ్డి టీడీపీ కండువాలు కప్పారు. మొత్తం 30 మందికి కండువాలు కప్పి 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. అయితే వారు 24 గంటలలోపే వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. 'జన్మదిన వేడుకలని చెప్పి తీసుకెళ్లి మాకు ఇష్టంలేకున్నా కండువాలు కప్పారని, తాము వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తిలేదని' వారు చెప్పడంతో సోమిరెడ్డి మరోసారి ప్రజల ముందు నవ్వులపాలయ్యాడు.



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో మందల వెంకటశేషయ్య

సోమిరెడ్డి..నీచ రాజకీయాలు మానుకో

ఉనికి కోసం నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య హితవుపలికారు. కాకుటూరుకు చెందిన పలువురు కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారికి మందల వెంకటశేషయ్య కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ జన్మదిన వేడుకల పేరుతో పిలిచి కాకుటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు కూడా కండువాలు కప్పి టీడీపీలో చేరినట్లుగా ప్రకటించడం సోమిరెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమానికి 40 మంది హాజరవగా 70 కుటుంబాలు చేరినట్లుగా ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. సోమిరెడ్డి ఆర్భాటంగా ప్రకటన చేసిన 24 గంటల్లోపే తమ పార్టీ కార్యకర్తలంతా వచ్చి తాము వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తి లేదని కండువాలు కప్పించుకున్నారని తెలియజేశారు. రోజురోజుకు దిగజారిపోయి రాజకీయాలు చేస్తూ ప్రజల్లో సోమిరెడ్డి నవ్వులపాలవుతున్నాడని పేర్కొన్నారు. ఇకనైనా నీచరాజకీయాలు మానుకుని హుందాగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం

బుచ్చిరెడ్డిపాళెం:మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధీర్ ఆదివారం తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

గ్రామదేవతకు పొంగళ్లు



పొదలకూరు : మండలంలోని పార్లపల్లిలో కొలువైన అమ్మగారి గ్రామదేవతకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని పొంగళ్లు పెట్టుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

17 వరకు ఒంటి పూట బడులు

పొదలకూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఎండల తీవ్రత దృష్టిలో ఉంచుకుని ఈ నెల 17వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్ ఆదివారం తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఉత్తర్వులను పాటించాలని సూచించారు.

5,840 మందికి విద్యాకానుక

మండలంలోని 5,840 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇప్పటికే మండల విద్యా వనరుల కార్యాలయానికి చేరుకున్న కిట్లను పాఠశాలల వారీగా విభజించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశామని వివరించారు.

షూటింగ్ బాల్ క్రీడాకారులకు సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రెయిన్‌బో ప్రైవేటు పాఠశాలలో అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారులను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమతాటి రమణయ్య మాట్లాడుతూ గత ఫిబ్రవరి నెలలో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన మొదటి ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో కృష్ణాజిల్లాకు చెందిన విజయ్‌కుమార్, హనీఫ్‌నాగ్, శివాంజనేయులు భారత జట్టు తరఫున పాల్గొన్నారని తెలిపారు. అలాగే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో బుచ్చిరెడ్డిపాళెంలో జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోర్ల భరత్, సీనియర్ క్రీడాకారులు దేవేంద్ర, పరమేశ్వరరెడ్డి, భరత్‌కుమార్, నవ్య, సుస్మితలు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు అయ్యంకి



ఇందుకూరుపేట: మైపాడులో విద్యార్థులకు బహుమతుల ప్రదానం



కొడవలూరు గ్రంథాలయంలో అయ్యంకి చిత్ర పటానికి నివాళులు

కొడవలూరు: గ్రంథాలయాల ఏర్పాటుకు బీజం వేసి గ్రంథాలయాల పితామహుడిగా అయ్యంకి వెంకటరమణయ్య పేరు గడించారని విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకయ్య కొనియాడారు. కొడవలూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించిన అయ్యంకి వాటి ఏర్పాటుకు ఎంతగానో కృషి చేశారన్నారు. నేటి సమాజంలో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయంటే అందులో అయ్యంకి కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరిగా విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకయ్యను ఘనంగా సన్మానించారు. లైబ్రేరియన్ కే రాజేశ్వరి, పాఠకులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు, ఇందుకూరుపేట శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలు, వ్యాసరచన, తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మైపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సంగం వెంకయ్య, లైబ్రేరియన్ మంజులత పాల్గొన్నారు. ఇందుకూరుపేటలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతమ్మ, లైబ్రేరియన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

బుచ్చిరెడ్డిపాళెం: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దామరమడుగు పంచాయతీ ఆర్‌ఆర్‌నగర్‌కు చెందిన వివాహిత కోసూరు లేఖశ్రీ (24) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు..లేఖశ్రీకు గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన లేఖశ్రీ ఈ నెల 7న ఇంట్లో పురుగు మందు తాగింది. గమనించిన తల్లి అల్లుడు వెంకటరమణయ్యకు తెలుపగా వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అనంతరం చెన్నైలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో లేఖశ్రీ ఆదివారం వేకువన మృతి చెందింది. కాగా మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆలయంలో ప్రతిష్టించనున్న విగ్రహాలు



శ్రీవిద్యారణ్యస్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ముత్తుకూరు: కృష్ణపట్నంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ 22 విగ్రహాలకు అభిషేకాలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా సోమవారం నూతన విగ్రహాల ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట నిర్వహించనున్నారు. హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతిస్వామి హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆలయ ఈఓ జనార్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బయ్య పిళ్లైలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

చాటగొట్ల–బిరదవోలు రోడ్డుకు మోక్షం

పొదలకూరు : చాటగొట్ల–బిరదవోలు రోడ్డు పనులకు మోక్షం కలిగింది. ఈ రోడ్డు మనుబోలు, పొదలకూరు, సైదాపురం మండలాల్లోని 16 గ్రామాలను కలుపుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డును దశాబ్దాలుగా పట్టించుకోకుండా వదిలేయడంతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. మనుబోలు–పొదలకూరు రోడ్డు నుంచి పొదలకూరుతో పనిలేకుండా నెల్లూరుకు ఈ రోడ్డు మార్గంలో వెళితే సుమారు 10 కి.మీ వరకు దూరం తగ్గుతుంది. పొదలకూరు మండలంలోని బిరదవోలు, బ్రాహ్మణపల్లి, ముత్యాలపేట, కల్యాణపురం, చెర్లోపల్లి, పార్లపల్లి, మనుబోలు మండలం అక్కంపేట, గొట్లపాలెం, వడ్లపూడి, బండేపల్లి, మడమనూరు, సైదాపురం మండలం కట్టుముడిపల్లి, మలిచేడు, దేవరవేమూరు, తదితర గ్రామాల ప్రజలు నెల్లూరు వెళ్లేందుకు ఈ మార్గం ఎంతో ఉపయోగపడుతుంది.



తారురోడ్డు నిర్మాణానికి గ్రావెల్ పరిచిన దృశ్యం

ఈ లింకు రోడ్డు ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మార్కెటింగ్ నిధులు రూ.2.60 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో సుమారు రూ.3 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

నత్తనడకన బాక్స్‌టైప్ బ్రిడ్జి పనులు



అసంపూర్తిగా బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణం



టపాతోపు గేటు మూసివేసి దారికి అడ్డంగా ఇనుప కమ్ములు వేసిన దృశ్యం

కొడవలూరు: మండలంలోని టపాతోపు రైల్వే గేట్ వద్ద చేపడుతున్న బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడక సాగుతున్నాయి. ఈ గేటు వద్ద ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని రూ.11 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే శాఖ బాక్స్ టైప్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. పనుల ప్రారంభ సమయంలో ఏప్రిల్ మొదటి వారంలోగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే తొలుత శరవేగంగా సాగిన పనులు ఆ తరువాత పూర్తిగా మందగించాయి. బ్రిడ్జి పనుల దృష్ట్యా టపాతోపు రైల్వే గేటును మూసి వేయడంతో విడవలూరు, అల్లూరు మండలాలతో పాటు కొడవలూరు మండలంలోని అనేక గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు కొడవలూరు రైల్వే గేటు మీదుగా వెళ్లడం ఆరంభించారు. ఈ కారణంగా కొడవలూరు రైల్వే గేటు వద్ద రద్దీ నెలకొంది. ఈ గేటు మీదుగా వెళ్లడం వల్ల దూరం పెరగడంతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే బాక్స్ టైప్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తుందన్న భావనతో ప్రయాణికులు దూరమైనప్పటికీ కొడవలూరు నుంచే వెళుతున్నారు. ఎండలు మండుతున్న తరుణంలో కొడవలూరు రైల్వే గేటు వేసిన సమయంలో గంటల తరబడి వేచిఉండాల్సి రావడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బాక్స్ టైప్ బ్రిడ్జి పనులు నెల రోజులపాటు పూర్తిగా నిలిచిపోయి మళ్లీ ఆరంభించినప్పటికీ మందకొడిగా సాగుతున్నాయి. నెల రోజుల పాటు పనులు నిలిచిన సమయంలోనూ టపాతోపు గేటును మూసే ఉంచారు. పనులు నిలిచిన సమయంలో గేటును తెరిచి ఉంటే ప్రయాణికులకు కాస్త ఊరట లభించేది. అలా చేయకపోగా గేట్‌ను మూసివేసే ఉంచారు. బ్రిడ్జి పనులు అత్యంత మందకొడిగా సాగుతుండడంతో ఎప్పటికి పూర్తవుతాయనేది సందిగ్ధంగా మారింది. టపాతోపు గేట్ మూతతో కొడవలూరు గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో పాటు వాహనాలు బారులు తీరి నిలిచిపోయి ఎండ ధాటికి ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని పనుల్లో వేగంపెంచి త్వరితగతిన పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.